భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్

– ఈద్గాలు, మసీదుల్లో భక్తుల సందడి

కడప కల్చరల్ : కడప నగరంలో ముస్లిం భక్తులు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మత గురువులు భక్తులతో సామూహిక ప్రార్థనలు చేయించారు. ఈ సందర్భంగా దైవం మానవాళికి మార్గదర్శనం చేసిన అంశాలను గురించి వివరించారు. జీవితంలో చేసిన తప్పులను తొలగించుకోవడానికి రంజాన్ మాసం ఎంతో ఉపయోగకరమన్నారు. దైవం సూచనలను ఖచ్చితంగా పాటించినపుడే జన్మ సార్థకమవుతుందని, దైవానికి దగ్గర అవుతామని వివరించారు.

షాహీ ఈద్గాలో..

కడప నగరం ఆలంఖాన్‌పల్లె దగ్గర గల దండు షాహీ ఈద్గాలో ముతవల్లి మురాదియా పీఠాధిపతి సయ్యద్‌షా అక్మల్ పీరా మురాది భక్తులతో రంజాన్ సామూహిక ప్రత్యేక ప్రార్థనలను నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా ఆయన రంజాన్ పండుగ వెనుక గల దైవసందేశాన్ని వివరించారు. ప్రార్థనల్లో పీఠాధిపతి సోదరులు జమాలుల్లా బాషా సాహెబ్‌తోపాటు నగరానికి చెందిన పలువురు ముస్లిం ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

ఇతర మసీదుల్లో..

స్థానిక రవీంద్రనగర్‌లోని షహమీరియా మసీదులో పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా అహ్మద్ పీర్ షహమీరి రంజాన్ సందేశాన్ని అందజేసి భక్తులచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహింపజేశారు. అలాగే బుఖారియా మసీదులో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి ఈదుల్ ఫితర్ సందేశం అందించి ప్రార్థనలు నిర్వహింపజేశారు. ముస్లిం సోదరులు, స్థానిక ప్రముఖులు, భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. రామాంజనేయపురంలోని మజ్జిద్ ఖుబాలో హజరత్ యాకూబ్ జమాయి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగాయి. మాచుపల్లె అహలే హదీస్ ఈద్గా మైదానంలో, కడప నగరం అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహాత్ అరబిక్ కళాశాల ప్రాంగణంలో, గుర్రాలగడ్డలోని మజిదే హాజీరాబితో పాటు నగరంలోని దాదాపు అన్ని మసీదుల్లో ఈదుల్ ఫితర్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రంజాన్ శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్: పవిత్ర రంజాన్ సందర్భంగా సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పొట్టిపాటి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి, జోన్ అధ్యక్షుడు పి. రామ్మోహన్‌రెడ్డి, గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.


దండు షాహీ ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహింపజేస్తున్న పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా జమాలుల్లాబాష సాహెబ్


మసీద్ ఏ ఖుబాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


బిల్టప్ వద్ద పెద్దదర్గా పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న భక్తులు


రంజాన్ ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు


కడప నగరం బిల్టప్ వద్ద ప్రార్థనలలో ముస్లింలు


బుఖారియా మసీదులో పండుగ సందేశం ఇస్తున్న పీఠాధిపతి


బిల్టప్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

భారీ బందోబస్తు

కడప అర్బన్: ఈదుల్ ఫితర్ (రంజాన్) నేపథ్యంలో కడప నగరంలోని బిల్టప్ ఈద్గా వద్ద జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ సోమవారం భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. బిల్టప్ సర్కిల్ వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న టూ టౌన్ సి.ఐ నాగార్జున, చిన్న చౌకు సి.ఐ ఓబులేసు లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రార్థనా స్థలాల వద్ద ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా చూడాలని సూచించారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా అన్ని ఈద్గా మైదానాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లను చేశారు.


కడప నగరం బిల్టప్ వద్ద పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

క్లుప్తంగా

వాహనాల తనిఖీ


వాహనాల తనిఖీలో పోలీసులు

కడప అర్బన్: జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా సోమవారం పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని సూచించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కాశీ విశ్వనాథ సేవా సమితి సభ్యులు

కడప అర్బన్: సిద్ధవటం మండలంలోని కనుమలోపల్లి రైల్వే స్టేషన్‌లో ఉన్న గుర్తు తెలియని వృద్ధుడి (60) మృతదేహానికి సోమవారం శ్రీకాశీ విశ్వనాథ సేవా సమితి అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. అనాధ వృద్ధుడు మృతి చెందడంతో సిద్ధవటం పోలీసులు చుట్టుపక్కల విచారించారు. అతనికి సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో కడప నగరంలో అనాధలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న శ్రీకాశీ విశ్వనాథ సేవా సమితి అనే స్వచ్ఛంద సేవా సంస్థకు అంత్యక్రియల నిమిత్తం వృద్ధుని మృతదేహాన్ని అప్పగించారు. వారు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, నాగుల రాంప్రసాద్ (ఆర్టీసీ రిటైర్డ్ డీఎం), రెడ్డి లక్ష్మణ్ దామోదర్, సివిల్ సప్లై సురేష్, ఎలక్ట్రిషన్ మధు, సిద్ధవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం


రాజు రామసుబ్బారెడ్డి

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వై.జంక్షన్ సమీపంలో ఆర్‌వీఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న రాజు రామసుబ్బారెడ్డి (74) అనే వృద్ధుడు సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. అతని ఆచూకీ తెలియరాలేదు. అతని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు కడప చిన్నచౌక్ సీఐ సెల్ నెం: 9121100520కుగానీ, 9121100521కు గానీ తెలియజేయాలని చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కడప రిమ్స్ మార్చురీలో రెండు మృతదేహాలు




కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఇద్దరు వేర్వేరు గుర్తు తెలియని వ్యక్తులు చికిత్స పొందేందుకు వచ్చారు. వారు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ రెండు మృతదేహాలను మార్చురీలో ఉంచారు. వారి ఆచూకీ తెలిసిన బంధువులు, కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

జయాపజయాలను సమానంగా స్వీకరించాలి

నందలూరు : క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరించాలని రైల్వే మెడికల్ ఆఫీసర్ జయభాస్కర్ రావు, ఎస్ఐ శ్రీధర్, ఏఎస్ఐ మోజెస్‌లు సూచించారు. నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో స్మాషర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య, కడప జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ (డబుల్స్) టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు.

రైతుల కడుపు కొట్టిన కూటమి ప్రభుత్వం

కమలాపురం: తీవ్ర కరువుతో కొట్టు మిట్టాడుతున్న కమలాపురం నియోజకవర్గ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వం రైతుల కడుపు కొట్టినట్టేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయి అప్పులు చేసుకుని దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నప్పటికి కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కమలాపురంలోని ఒక్క మండలం కూడా లేక పోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. నియోజకవర్గ రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, సాగు చేసిన పంటలకు పెట్టుబడులు సైతం రాక భూములను చూసిన రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

వైభవంగా నారాయణస్వామి తిరునాల


ప్రత్యేక అలంకరణలో నారాయణ స్వామి


తిరునాలలో పాల్గొన్న భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బాలుపల్లె సమీపంలో వెలసిన కమ్మేటిపల్లె నారాయణస్వామి తిరునాల సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది మరుసటి రోజు నారాయణ స్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. నారాయణస్వామి, రామయ్యస్వామి, కంటిపాపులమ్మ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వాములను దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. విందు భోజనం ఏర్పాటు చేసుకున్నారు. రామయ్యస్వామి శిష్యులు చేసిన గుర్రపు స్వారీ భక్తులను అలరించింది. ఆలయ ధర్మకర్తలు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కరువు భత్యాన్ని ప్రకటించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ కోరారు. సోమవారం కడపలోని ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన వెంటనే కరువు భత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ అమరావతి కడప , అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ఉమా కాంత్ మాట్లాడుతూ వయస్సు పైబడిన వారికి ,చిన్న పిల్లల తల్లులకు, వికలాంగులకు, అనారోగ్యులకు 10వ తరగతి స్పాట్ నుండి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. ఏపీటీఎఫ్ అమరావతి మహిళా కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు రాజగోపాల్ , చంద్రశేఖర్ రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో రూపొందించిన విద్యుత్ షాకులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం...అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఎన్‌డీఏ కార్యకర్తలు

మైలవరం : మండలంలోని వద్దిరాల గ్రామానికి చెందిన ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలోని సుంకులాంబ తిరునాల సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అనంతరం గ్రామంలో ఎన్‌డీఏ కూటమికి చెందిన కొందరు కార్యకర్తలు స్థానిక నాయకుడు వెంపలాకు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంపలాకు చెన్నూరు యాదవ్, పెద్దలక్షుమయ్య, దస్తగిరి, గద్వాల్ ఖాసీ, పి.సుబ్రమణ్యం, గురుశేఖర్, ఫణీత్, మరో 15 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందేవన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహాలక్ష్మీ, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వర రెడ్డి, జమ్మలమడుగు కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపాలిటీల విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



కోలాట ప్రదర్శనలో విద్యార్థినులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామం, డాక్టర్ వైఎస్ఆర్ ఉల్లిమెళ్ల లేక్ ఫ్రంట్‌లో ఉగాది పార్వ, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక శిల్పారామంలో సోమవారం సాయంత్రం వేదాంత హాస్పిటల్ వారి సౌజన్యంతో యువ రాజా డ్యాన్స్ స్కూల్ వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో రంజాన్ సందర్భంగా సోమవారం ఎస్కే డ్యాన్స్ స్టూడియో వారి ఆధ్వర్యంలో జగన్నాథం మూవీ టీం హీరో రాయలసీమ భరత్, స్కూల్ లైఫ్ మూవీ హీరో అండ్ డైరెక్టర్ పులివెందుల మహేష్, వృషభ లీడర్ జీవన్‌రెడ్డి, సపోర్టింగ్ క్యారెక్టర్ కిట్టులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

భారీ.. లారీ..



కడప–చెన్నై రహదారిలో నిత్యం భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అందుకే ఈ రహదారిలో ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంటుంది. సోమవారం 74 టైర్లు కలిగిన పెద్దలారీలో భారీ యంత్రాన్ని తరలిస్తున్నారు. మార్గమధ్యలో ఉన్న విద్యుత్‌లైన్లు, చెట్లు, బోర్డులను తప్పించుకుంటూ చాలా నెమ్మదిగా ఈ లారీ కదులుతుండటంతో స్థానికులు దీన్ని ఆసక్తిగా తిలకించారు. నాలుగు లేన్ల రహదారి నిర్మాణం జరిగి ఉంటే ఇలాంటి వాహనాలు చాలా సులభంగా వెళ్లేందుకు ఆస్కారం ఉండేది. కొన్నేళ్లుగా ఈ మార్గంలో నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కలగానే ఉంది. – కడప కార్పొరేషన్

పైపులైన్ లీకేజీ



కడప నగరం రామాంజనేయపురం పరిధిలో రిమ్స్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఎంఆర్‌ఆర్ టైర్స్ వద్ద తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఫలితంగా పెద్ద ఎత్తున తాగునీరు వృథా అవుతున్నాయి. ఈ పైపులైన్ ద్వారానే కడప నగరానికి నీరు అందుతున్నాయి. పెద్ద పైపులైన్ కావడంతో నీటి వృథా కూడా ఎక్కువగానే ఉంది. అధికారులు పైపులైన్‌ను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – కడప కార్పొరేషన్